సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025

కన్నపేగు కాఠిన్యం

సండే స్పెషల్

తమను పున్నామ నరకం నుంచి తప్పించకపోయినా బతికుండగా వృద్ధాప్యంలో చేరదీసి పట్టెడన్నం పెడతారని బిడ్డలపై ఆశలు పెట్టుకునే తల్లిదండ్రులెందరో. అయితే చాలామంది కొడుకులు తల్లిదండ్రుల్ని పట్టించుకోకుండా వారి ఆశల్ని వమ్ము చేస్తూ కనీస మానవత్వాన్ని మరిచిపోతున్నారు. పున్నామ నరకమేమో తెలియదు కానీ తల్లిదండ్రుల్ని బతికుండగానే నరకం చూపించేస్తున్నారు. కన్నవారి పట్ల కాఠిన్యం కమ్ముకున్న కొడుకుల దాష్టీకాలపై ఈ వారం కథనం. - మెదక్‌జోన్

10లో





బీసీ బంద్ సందర్భంగా సంగారెడ్డిలో మూసి ఉన్న దుకాణాలు



బస్సులు లేక వెలవెలబోతున్న సంగారెడ్డి కొత్త బస్టాండ్ ప్రాంగణం

బీసీ బంద్ సంపూర్ణం

బీసీ రిజర్వేషన్ల సాధనకోసం శనివారం చేపట్టిన బీసీ బంద్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో దుకాణదారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు బంద్‌లో పాల్గొని ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించేంతవరకు తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ సంఘాల జేఏసీ తేల్చి చెప్పింది.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న నిర్మలా రెడ్డి



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



అమ్మకానికి ఉంచిన బొమ్మలకొలువు

దీపావళి సందడి

దీపావళి పండగను పురస్కరించుకుని సంగారెడ్డిలో కొనుగోళ్ల సందడి మొదలయ్యింది. లక్ష్మిపూజల కోసం బొమ్మల కొలువు కోసం వ్యాపారులు రంగురంగుల బొమ్మలు మార్కెట్లో అందుబాటులో ఉంచారు. విభిన్న రూపాలలో లక్ష్మీదేవి విగ్రహాలను అమ్మకానికి ఉంచారు. రకరకాల ఆకృతులతో అందమైన దీపంతలు, మల్టీకలర్ దొంతులు ప్రత్యేక ఆకర్షణగా కనిపించాయి. నైవేద్యానికి వినియోగించే పేనీలు, బత్తీసలు సైతం అందుబాటులో ఉంచారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి





అమ్మకానికి ఉంచిన బత్తీసలు, పేనీలు

న్యూస్‌రీల్

తహసీల్‌గ్రౌండ్‌లో బాణసంచా దుకాణాలు



తహసీల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసుకుంటున్న బాణసంచా దుకాణాలు

నారాయణఖేడ్: ప్రమాదాలకు అవకాశం లేకుండా చుట్టుపక్కల నివాసగృహాలు లేని, పక్కనే అగ్నిమాపక కేంద్రం ఉన్న ఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో బాణసంచా దుకాణాలకు అధికారులు అనుమతులివ్వడంతో దుకాణాదారులు శనివారం షెడ్లు, టెంట్లతో దుకాణాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్ ఇదివరకే ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్ల గురించి అవగాహన కల్పించగా ఈ మేరకు దుకాణాదారులు వాటిని పాటిస్తూ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రాజన్నను దర్శించుకున్న దత్తగిరి మహారాజ్



దత్తగిరి మహారాజ్ స్వామీజీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ: వేములవాడ రాజన్నను బర్దీపూర్ (సంగారెడ్డి జిల్లా)కు చెందిన దత్తగిరి మహారాజ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాన్ని ఆలయ అధికారులు మహారాజ్ అందజేశారు. ఆయన వెంట ప్రొటోకాల్ ఏఈవో అశోక్‌కుమార్, ఆలయ పర్యవేక్షకులు నునుగొండ రాజేందర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఉద్యోగులు ఉన్నారు.

నక్కవాగులో అక్రమ తవ్వకాలు

సాక్షి, సిటీబ్యూరో: రామచంద్రాపురంలోని నక్కవాగులో అక్రమంగా మట్టి, ఇసుకను తవ్వుతున్న ముఠా గుట్టు రట్టయింది. రెవెన్యూ, ఇరిగేషన్, ట్రాన్స్‌పోర్ట్, మైన్స్, పోలీసు విభాగాలతో సమన్వయంతో ఆర్సీపురం యూనిట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కంది మండలం బైయాథోల్ గ్రామంలోని నక్కవాగులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ట్రాక్టర్ పంపులు వినియోగించి వాగులో నుంచి మట్టి, ఇసుకను తవ్వుతున్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి లారీలు, ఇతర భారీ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేశారు. అలాగే నిందితులు తాత్కాలిక నిర్మాణాలను నిర్మించి నక్కవాగు ప్రవహించే రెండు మార్గాలను అడ్డుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఇరిగేషన్ విభాగానికి సమాచారం అందించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎర్రోళ్లకు ఈటల పరామర్శ

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ శనివారం పరామర్శించారు. ఎర్రోళ్ల తండ్రి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం గంగాపూర్‌లోని ఆయన నివాసంలో ఈటల, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతకుముందు గంగాపూర్ పెద్దమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు.

4,012 దరఖాస్తులే

- గతంతో పోల్చితే భారీగా తగ్గిన మద్యం టెండర్ల దరఖాస్తులు
- ఫీజు రూ.3 లక్షలకు పెంచడమే కారణమంటున్న ఎక్సైజ్ వర్గాలు
- మద్యం షాపులకు ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు కోసం ఎక్సైజ్‌శాఖ నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. ఈసారి దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గింది. మద్యం వ్యాపారులు ఈసారి ఆచితూచి వ్యూహాత్మకంగా దరఖాస్తులు చేశారు. జిల్లాలోని ఐదు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 101 మద్యం షాపులకు శనివారం రాత్రి వరకు దరఖాస్తులు తీసుకున్నారు. మొత్తం 4,012 దరఖాస్తులే వచ్చినట్లు ఎక్సైజ్‌శాఖ ప్రకటించింది.చివరిరోజు మొత్తం 1,732 దరఖాస్తులు వచ్చాయి. గతంతో పోల్చితే ఈ దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గింది. 2023లో 101 షాపులకు 6,156 దరఖాస్తులు రాగా, ఈసారి 4,012కు పరిమితమైంది. అయితే పటాన్‌చెరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో ఉన్న షాపులకు దరఖాస్తుల సంఖ్య పెద్దగా తగ్గకపోయినా, మండలాల్లో ఉన్న షాపులకు దరఖాస్తుల సంఖ్య తగ్గింది. ప్రధానంగా నారాయణఖేడ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపులకు అతి తక్కువ దరఖాస్తులు వచ్చాయి. కాగా 2023లో ఈ దరఖాస్తుల రూపంలోనే ఎక్సైజ్‌శాఖకు రూ.123.12 కోట్లు ఆదాయం రాగా, ఈసారి దరఖాస్తుల ఫీజు రూ.మూడు లక్షలకు పెంచినప్పటికీ..ఆదాయం మాత్రం రూ.120.36 కోట్లకు పరిమితమైంది.

రూ.3 లక్షలకు పెంచడమే కారణమా!

ప్రభుత్వం ఈసారి మద్యం షాపుల దరఖాస్తు ఫీజును భారీగా పెంచింది. 2023లో రూ.రెండు లక్షలు ఉన్న ఈ ఫీజును ఈసారి ఏకంగా రూ.3 లక్షలకు పెంచింది. దీంతో మద్యం వ్యాపారులు ఆచితూచి దరఖాస్తులు చేసుకున్నారు. గతంలో ఒక్కో షాపునకు ఆరు ఏడు దరఖాస్తులు చేసుకునే మద్యం సిండికేట్ వ్యాపారులు ఈసారి నాలుగైదుతో సరిపెడుతున్నారు. ఒక్కో షాపునకు 20 వరకు దరఖాస్తులు చేసుకున్న సిండికేట్లు ఇప్పుడు పది, 15కే సరిపెట్టారని ఎక్సైజ్ వర్గాలు భావిస్తున్నాయి. లక్కీడ్రాలో షాపు రాకపోతే జరిగే నష్టం ఎక్కువగా ఉండటంతో మద్యం వ్యాపారులు ఆచితూచి దరఖాస్తులు చేసుకున్నారు. గురువారం వరకు ఒక్క దరఖాస్తు రాని షాపులు ఆరున్నాయంటే ఈసారి స్పందన ఎంత తక్కువగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అయితే శుక్ర, శనివారాల్లో ఈ షాపులకు కూడా దరఖాస్తులు వచ్చాయి.



ఎక్సైజ్ కార్యాలయం వద్ద మద్యం వ్యాపారుల సందడి

చివరి రోజు బల్క్‌గా..

దరఖాస్తుల సమర్పణకు చివరి రోజు శనివారం ఎక్సైజ్ సూపరిండెంట్ కార్యాలయం వద్ద హడావిడి నెలకొంది. శనివారం రాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించారు. సిండికేటుగా మారిన మద్యం వ్యాపారులు చివరి క్షణంలో బల్క్‌గా దరఖాస్తులు చేసుకున్నారు. అమీన్‌పూర్‌లోని ఓ మద్యం షాపునకు శనివారం రాత్రి ఓ సిండికేట్ ఏకంగా 30 దరఖాస్తులు ఒక్కసారే అందజేశారు.

జాతీయ క్రీడలకు వేదికగా పటాన్‌చెరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ముగిసిన 69 వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడలు



గెలుపొందిన క్రీడాకారులతో ఎమ్మెల్యే

పటాన్‌చెరు: క్రీడలకు, క్రీడాకారులకు కేంద్రంగా పటాన్‌చెరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని..రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఆతిథ్యం ఇవ్వబోతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా పటాన్‌చెరులోని మైత్రి మైదానం వేదికగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14 బాలుర, బాలికల కబడ్డీ ,అండర్ 17 బాలుర వాలీబాల్ విభాగం రాష్ట్రస్థాయి పోటీలు శనివారం ముగిశాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారుడు కృష్ణం రాజుతోపాటు రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమష్టికృషితో రాష్ట్రస్థాయి క్రీడలను విజయవంతం చేశామన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేశ్ మాట్లాడుతూ...క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే లభించడం పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల అదృష్టం అన్నారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి కబడ్డీ జట్టులో తెలంగాణ క్రీడాకారుల ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్షించారు. కబడ్డీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్ మాట్లాడుతూ..కబడ్డీ క్రీడలో జాతీయస్థాయిలో మెదక్ జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం ప్రశంసనీయమన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గం నుండి కబడ్డీ క్రీడాకారులు సైతం జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక కావాలని అభిలాషించారు.

మెదక్ జట్టు ఘన విజయం

శనివారం సాయంత్రం అభిమానుల మధ్య జరిగిన అండర్ 14 బాలుర కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో నల్లగొండ జిల్లా జట్టుపై మెదక్ జట్టు ఘన విజయం సాధించింది..అండర్ 14 బాలికల కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు పైన ఖమ్మం జిల్లా జట్టు పైన ఘన విజయం సాధించింది. అండర్ 17 బాలుర వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ లో వరంగల్ జిల్లా జట్టుపై ఖమ్మం జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ సపనా దేవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మధుసూదన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, ఎంఈవో లు పీపీరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నర్సాపూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఇన్‌చార్జి డీడబ్ల్యూఓ హేమభార్గవి అన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీలోని హస్మంతాపూర్‌లో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వయం సహాయక సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగు పర్చుకోవడానికి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. చదువుకొని విజ్ఞాన వంతులు కావాలన్నారు. సమావేశంలో లీగల్ సర్వీస్ కమిటీ సభ్యురాలు స్వరూపరాణి, జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ కోఆర్డినేటర్ సంతోష, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి తగదు

'సాక్షి'పై కూటమి దాడులు

ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు ఖండించిన ప్రజా సంఘాల నాయకులు



సంగారెడ్డి టౌన్ : పత్రికలు స్వేచ్ఛగా పనిచేస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని, మీడియా స్వేచ్ఛ కు సంకెళ్లు వేస్తే ప్రజాస్వామ్య మనుగడకే చేటు చేసినట్లవుతుందని సంగారెడ్డి జిల్లాలో వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఏపీ పోలీసులు పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం అంశాలపై కథనాలు రాసిన 'సాక్షి'పై తప్పుడు కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని వక్తలు అభిప్రాయపడ్డారు. పత్రికల గొంతు నొక్కేలా వ్యవహరించడం మంచిది కాదని ముక్తకంఠంతో ఖండించారు.

పత్రిక గొంతు నొక్కితే పతనం తప్పదు



రాజకీయ కక్షతో 'సాక్షి'దినపత్రిక గొంతు నొక్కాలని చూస్తే పతనం తప్పదు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించే కుట్ర చేస్తున్నది. ప్రజల పక్షాన వార్తలు ప్రచురిస్తున్న 'సాక్షి'దినపత్రిక ఎడిటర్, జర్నలిస్టులపై ఏపీ కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– శ్రీధర్ మహేంద్ర, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు

పత్రికలపై కక్ష సాధింపు సరికాదు



పత్రికలపై ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలు మంచిది కాదు. 'సాక్షి'ఎడిటర్ ధనంజయ రెడ్డి, పత్రికపై పోలీసులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం రాజ్యాంగం ఇచ్చిన హక్కుకు కాలరాయడమే. పత్రికల విషయంలో కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరును ప్రజాస్వామ్యవాదులుగా ఖండిస్తున్నాం.

– కూన వేణు, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు

అక్రమ కేసులు ఉపసంహరించాలి



సాక్షిఎడిటర్ ధనంజయరెడ్డిపై కక్ష సాధింపులతో కేసులు పెట్టడం సరికాదు. ప్రజల కోసం వార్తలు రాసే మీడియా ప్రతినిధులపై ప్రభుత్వం కక్ష సాధింపు కోసం అక్రమ కేసులు పెట్టడం సరికాదు. కేసులను ఉపసంహరించుకోవాలి. – బంగారు కృష్ణ, జన జాగృతి సేన, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

మానసిక హింసకు గురిచేయడం సరికాదు



ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరించే మీడియా ఎపుడు ప్రజల పక్షమే వాహించాలి. నిజాలను శోధించి ప్రజలను జాగరూకత పరిచే బాధ్యత కూడా మీడియాదే. ఏపీలో సరిగ్గా ఆ పాత్రనే పోషిస్తున్న 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి మీద 'సాక్షి'సిబ్బంది మీద పోలీసులు అక్రమ కేసులు పెట్టి మానసిక హింసకు గురించేయడం సరికాదు. పాలకులకు అనుకూలంగా రాయడం లేదని, పోలీసుల ద్వారా అణచివేతకు గురిచేస్తే అది పత్రికా స్వేచ్ఛను హరించడమే. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం వెంటనే మానుకోవాలి.

– వై.అశోక్ కుమార్,జిల్లా చైర్మన్, (టీపీజేఏసీ)

బాణసంచా దుకాణంలో అగ్నిప్రమాదం

- రూ.25లక్షల విలువ చేసే టపాసులు దగ్ధం
- జోగిపేటలో గంటకు పైగా భారీ పేలుడు శబ్దాలు
- ఫైర్ స్టేషన్ అధికారుల సహాయక చర్యలు
- జిల్లా ఫైర్ అధికారి నాగేశ్వరావు సందర్శన



జోగిపేట సమీపంలో దగ్ధమవుతున్న టపాసుల దుకాణం

జోగిపేట(అందోల్)/సంగారెడ్డి: జోగిపేట సమీపంలోని కట్టుకం వేణుగోపాల్ అండ్ సన్స్ బాణసంచా హోల్‌సేల్ దుకాణంలో శనివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.25 లక్షల విలువ చేసే మందుగుండు సామగ్రి పేలి బూడిదైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గత నెల రోజులుగా ఈ దుకాణంలో భారీగా విక్రయాలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం యథావిధిగానే అమ్మకాలు జరుగుతుండగా ఒక్కసారిగా చిన్నగా పేలుడు శబ్దం వినిపించడంతో దుకాణం నుంచి అందరూ బయటకు పరుగులుపెట్టి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. ఈలోగా దుకాణంలోని ఇతర మందుగుండు సామగ్రికి మంటలు అంటుకోవడంతో అవి పేలి బూడిదయ్యాయి. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడటం, ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి తీసుకున్నారు. ఇక దగ్ధమైన షాపునకు 50 మీటర్ల దూరంలోనే ఓ గోడౌన్‌లో లక్షల విలువ చేసే బాణసంచా నిలువ ఉన్నాయి. టపాసులు అటువైపు ఎగిరిపడక పోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్టైంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది జోగిపేట, సంగారెడ్డి ఫైర్ ఇంజన్ల సహకారంతో మంటలను అదుపుచేశారు.

మేలుకోని అగ్నిమాపక శాఖ అధికారులు

ఓ వైపు నిబంధనలను పాటించాలి అంటూనే.. మరోవైపు వాటిని అధికారులే విస్మరిస్తూ బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చి తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫైర్ సేఫ్టీ వివిధ శాఖల అధికారులు నిబంధనలు కఠినతరం చేసి ప్రమాదాలు నివారించేందుకు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు. జోగిపేట సమీపంలో బాణసంచా హోల్‌సేల్ షాపు దగ్ధం కావడంతో వివరాలు తెలుసుకున్న జిల్లా ఫైర్ అధికారి నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

మొత్తం 400 దుకాణాలకు అనుమతి

ఇప్పటివరకు జిల్లాలో 400 టపాకాయల దుకాణాలు అనుమతి తీసుకున్నారు. అందులో 35 షాప్‌లను తిరస్కరించాం. ఈరోజు కూడా జిల్లాలో తమ సిబ్బందిని తిప్పి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తొలగిస్తాం.

– నాగేశ్వర్‌రావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి,

జిల్లాలో బీసీ బంద్ విజయవంతం

- పాల్గొన్న పార్టీ నేతలు, వివిధ సంఘాల నాయకులు
- స్వచ్ఛందంగా పాటించిన వ్యాపార సముదాయాలు



సంగారెడ్డిలో బీసీ బంద్‌లో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు, నాయకులు

సంగారెడ్డి: జిల్లాలో చేపట్టిన బీసీ రిజర్వేషన్లపై బంద్ శనివారం విజయవంతమైంది. జిల్లా కేంద్రం సంగారెడ్డితోపాటు ఆయా మండలాలు, పట్టణాలు, గ్రామాలలో బీసీ బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలతో పాటు,సీపీఎం,సీపీఐ ఆయా సంఘాల నాయకులు, నేతలు, విద్యార్థి సంఘాలు పాల్గొని వ్యాపార కార్యకలాపాలు జరగకుండా చూశారు. ఈ బంద్‌లో స్వచ్ఛందంగా ఆర్టీసీ, వివిధ వ్యాపార సముదాయాలు బంద్‌ను పాటించారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ ప్రభుగౌడ్, పలు సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు టీజీఎంఎస్(తెలంగాణ మోడల్ స్కూల్)కు చెందిన విద్యార్థిని లావణ్య ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వన్నెసా తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ అండర్-17 విభాగంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని లావణ్యతో పాటు పీడీ పద్మను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

372 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): ఓ రైస్‌మిల్లుపై అధికారులు దాడులు చేసి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా... అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామ శివారులోని లక్ష్మీప్రసన్న రైస్ మిల్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. రైస్‌మిల్లులో 372.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మరో రైస్ మిల్‌కు అధిక ధరలకు అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్ చేసి మంజునాథ రైస్ మిల్‌కు తరలించినట్లు అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి ఎం.సాయి రవి తెలిపారు. కాగా రైస్ మిల్లు నిర్వహిస్తున్న కాపర్తి సంతోష్‌తో పాటు అతని పార్టనర్స్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరీశ్ తెలినారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధి మిర్జాపూర్(ఎన్) గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ సుజిత్ కథనం ప్రకారం... ఝరాసంగం మండల పరిధి తుమ్మన్‌పల్లికి చెందిన నదీం కుటుంబ సభ్యులతో కలిసి ముంగి గ్రామంలో జరిగే విందుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో రాయికోడ్‌కు చెందిన మరో వ్యక్తి బైక్‌పై వెళ్తున్నాడు. మిర్జాపూర్(ఎన్)గ్రామ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నదీంకు కాలు విరిగింది. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జహీరాబాద్‌కు ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి.. గాయాలు



గాయపడిన పుతురాజ్

జహీరాబాద్ టౌన్: ఓ వ్యక్తి చిరువ్యాపారిపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటన జహీరాబాద్‌లో చోటు చేసుకుంది. టౌన్ ఎస్ఐ. వినయ్‌కుమార్ కథనం ప్రకారం... తమిళనాడు మధురై జిల్లా పరిమల్‌పట్టికి చెందిన పుతురాజు సుమారు మూడేళ్ల నుంచి పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. స్నాక్స్ తయారు చేసుకుని ఊరూరా తిరుగుతూ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి మణికంఠ(29) కూడా హమాలీ కాలనీలో నివాసం ఉంటూ ఆయన ఇదే వ్యాపారం చేస్తున్నాడు. తాను వ్యాపారం చేస్తున్న ప్రాంతంలోకి రావద్దని మణికంఠ ఇటీవల పుతురాజును బెదిరించాడు. అయితే చెప్పిన మాట వినడం లేదని మణికంఠ అతడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో స్నాక్స్ అమ్ముకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా పుతురాజును పార్కు వద్ద అడ్డుకుని, బూతులు తిడుతూ కత్తితో వీపుపై దాడి చేశాడు. స్థానికులు అడ్డుకోవడంతో మణికంఠ పరారయ్యాడు. వెంటనే గాయపడిన అతడ్ని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నానమ్మకు తలకొరివి పెట్టిన మనుమరాలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న రమ్య

సిద్దిపేటరూరల్: విధి ఆడిన వింతనాటకంలో 14 సంవత్సరాల రమ్య అభాగ్యురాలిగా మిగిలింది. ఇంటి పెద్ద దిక్కు నానమ్మ కూడా అనారోగ్యంతో చనిపోవడంతో మనుమరాలు రమ్య అన్నీ తానై తలకొరివి పెట్టిన ఘటన శనివారం రావురూకుల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బ్యాగరి మల్లవ్వ, మనువరాలైన రమ్యతో కలిసి నివాసం ఉంటుంది. మల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. కాగా మల్లవ్వ భర్త వెంకయ్య గతంలో చనిపోగా, నాలుగేళ్ల కిందట కొడుకు, కోడలు కూడా అనారోగ్యంతో చనిపోయారు. రమ్యకు ఒక్క ఆధారమైన మల్లవ్వ మృతి చెందడంతో అనాథగా మారిన రమ్యను చూసి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా గ్రామస్తులు అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేశారు.



సండే స్పెషల్

కన్నపేగు కాఠిన్యం

కొడుకుల దాష్టీకానికి తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

కన్న బిడ్డలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులను చేసి వివాహాలు చేస్తే తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు. జీవిత చరమాంకంలో చూడాల్సిన కొడుకులు గాలికొదిలేస్తున్నారు. పట్టెడన్నం పెట్టమంటే తల్లిదండ్రులను కొట్టి గెంటేస్తున్నారు. ఆస్తులు లాక్కొని రోడ్డున పడేస్తుండటంతో వృద్ధులు తిండి, గూడు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొందరు భిక్షాటన చేస్తుండగా, మరికొందరు అధికారులను ఆశ్రయిస్తున్నారు. కొడుకుల దాష్టీకాలపై ఈ వారం కథనం.

– మెదక్‌జోన్

అన్నం పెట్టమంటే దాడులు..

- ఆస్తులు లాక్కొని రోడ్డున పడేస్తున్న వైనం
- కలెక్టర్‌ను ఆశ్రయించిన 11 మంది వృద్ధులు

మెదక్ జిల్లాలో కన్న బిడ్డలు తిండి పెట్టడం లేదని ప్రజావాణిలో వృద్ధులు కలెక్టర్‌ను కలిసి వేడుకుంటున్నారు. కడుపు కట్టుకుని పిల్లల్ని ప్రయోజకులను చేశామంటూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి అభాగ్యులను కలెక్టర్ ప్రత్యేకంగా పిలిపించి (సీనియర్ సిటిజన్ యాక్టు) ప్రకారం కన్న తల్లిదండ్రులను పోషించకుండా విస్మరించిన వారి నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. వీరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్కడ సమస్య పరిష్కారం కాని వారు నేరుగా కలెక్టరేట్‌లోని రెవెన్యూ(సీ) సెక్షన్‌లో అధికారులను కలిసి ఫిర్యాదు చేయాలనడంతో నేరుగా వృద్ధులు కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారు.

వృద్ధాశ్రమాల్లో అభాగ్యులెందరో..

మెదక్ జిల్లా కేంద్రంలో సంధ్యానిలయంలో కొందరు తలదాచుకుంటున్నారు. ఏ దిక్కులేని కొందరు కాగా మరి కొంత మంది అందరూ ఉండి కూడా ఇళ్ల నుంచి గెంటివేయబడిన అభాగ్యులు. ఇలాంటి వారి కోసం పిల్లికొటాల్ వద్ద గల ఎంసీహెచ్ ఆస్పత్రి సమీపంలో ఓ ఆశ్రమం నిర్మించారు. కానీ అది పట్టణానికి దూరంగా ఉండటంతో అక్కడికి వెళ్లకుండా జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసి ఫుట్‌పాత్‌లపై తల దాచుకుంటున్నారు. కాగా వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిపై చట్టాలు కఠినంగా అమలు చేసి వృద్ధులకు అండగా నిలవాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధులు

కలెక్టర్‌కు ఫిర్యాదులు.. కుమారులకు కౌన్సెలింగ్

కాగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా 11 మంది వృద్ధులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. వాటిని పరిశీలించి వారి పిల్లలను పిలిపించి తల్లిదండ్రులను పోషించడం 'భారం కాదు బాధ్యతగా' తీసుకోవాలని పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నెలకు రూ. 10 వేలకు తగ్గకుండా వారి వ్యాధులను బట్టి ఇవ్వాలని ఆదేశించారు. లేనిచో సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో కొందరు పిల్లలు మనసు మార్చుకుని వారి తల్లిదండ్రులను ఇళ్లకు తీసుకెళ్లగా, మరికొందరు పోషణ కోసం నెలనెల డబ్బులు ఇస్తామని ఒప్పుకుంటున్నారు. ఇంకొందరు అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు.

కుమారుడు గెంటివేస్తే..



సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరులో గ్రామానికి చెందిన గౌడుగు పోచయ్య(67)ను అవసాన దశలో పోషించలేక ఇంటి నుంచి కొడుకులు వెళ్లగొట్టారు. దీంతో ఎటుపోవాలో తెలియక రైతు వేదికలో తల దాచుకున్నాడు. తెల్లారేసరికి విగతజీవిగా కనిపించాడు. కాగా భర్తకు భార్య యాదవ్వనే అంత్యక్రియలు నిర్వహించింది.

పట్టెడన్నం పెడతలేరు



నాకు నలుగురు కొడుకులు. అందరిని పెంచి పోషించి ప్రయోజకులను చేసి వివాహాలు చేశా. ఉన్నదాంట్లో నలుగురికి సమానంగా ఆస్తి పంచాను. శరీరం సహకరించటం లేదు. ఏ కొడుకూ పట్టెడన్నం పెట్టడం లేదు.

- సుకన్య, ఆర్టీసీ కాలనీ, మెదక్

కొట్టి ఇంటి నుంచి గెంటేశాడు



నాకు ఇద్దరు సంతానం. కొడుకు, కూతురికి పెళ్లి చేశా. రెండెకరాల పొలాన్ని కొడుకు పేర పట్టా చేశా. పని చేద్దామంటే చేతకావడం లేదు. అన్నం పెట్టమంటే నా కుమారుడు ఇటీవల కొట్టి ఇంటి నుంచి గెంటేశాడు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను.

- మానెపల్లి చంద్రమ్మ, పోతాన్‌శెట్టిపల్లి, కొల్చారం మండలం

మమ్మల్ని పట్టించుకుంటలేరు..



మాకు ఇద్దరు సంతానం. కొడుకు, కూతురి పెళ్లి చేశాం. రెండు ఇళ్లతోపాటు ఇతర ఆస్తులు ఉండగా కూతురికి ఒక ఇల్లు ఇచ్చి, కొడుకుకు రూ. 3 కోట్ల విలువైన ఇల్లు గిఫ్ట్‌డీడీ చేశాం. ఆ ఇంటిని నా కుమారుడు మనవళ్ల పేరుపై రిజిస్ట్రేషన్ చేశాడు. మా భార్యాభర్తలను పట్టించుకోవడం లేదు. ఇద్దరికి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయి. **- ఎండీ హైమద్ హుస్సేన్, మజార్ సుల్తానా దంపతులు, తూప్రాన్**

పొలం పట్టా చేసుకుని..



నాకు ఇద్దరు కుమారులు. నా భర్త ఆరేళ్ల క్రితం చనిపోయాడు. ఉన్న రెండెకరాల పొలాన్ని నాకు తెలియకుండా నా చిన్నకొడుకు పట్టా చేసుకున్నాడు. అన్నం పెట్టకుండా ఇబ్బందులు పెడుతున్నారు.

- నాందేడ్ సుశీల, పెద్దశంకరంపేట

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న తూప్రాన్ డీఎస్పీ

నర్సాపూర్: దాడి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ కేసు వివరాలు వెల్లడించారు. ఉపాధ్యాయుడు కిష్టయ్య ఈనెల 16న సొంత పనిపై కొల్చారం మండల కేంద్రానికి వెళ్లి అనంతరం అన్నారంలోని తన ఇంటికి వెళ్లేందుకు బస్టాండు వద్ద ఆటో ఎక్కాడు. నర్సాపూర్‌కు రాగానే అన్నారం వైపు వెళ్లకుండా తూప్రాన్ మార్గంలోని ఓ కుంట వద్దకు తీసుకెళ్లి ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు అతడ్ని కత్తితో చంపుతామని బెదిరించి ఫోన్‌తో పాటు రూ.12వందలు దోచుకున్నారు. కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు చౌటకూరు మండలం శివ్వంపేటకు చెందిన సాయికుమార్, కుమార్, రంగంపేటకు చెందిన అనిల్‌ను అరెస్ట్ చేశారు. వీరు పాత నేరస్తులని,పలు కేసులు ఉన్నాయని తెలిపారు. కాగా నిందితులు ఉపయోగించిన ఆటోతోపాటు ఉపాధ్యాయుడి ఫోన్, 12 వందల నగదును స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మరో కేసులో ఇద్దరు..

చేర్యాల(సిద్దిపేట): దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎల్ శ్రీను కథనం మేరకు... చేర్యాలలోని ఎల్లమ్మ గుడి వద్ద ఎస్ఐ నవీన్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా ముస్త్యాలకు చెందిన కెంచు శివశంకర్, సాల్లూరి సిద్ధిరాములు బైక్‌పై వచ్చి పోలీసులను చూసి పారిపోయారు. దీంతో వారిని పట్టుకుని విచారించగా ఈనెల 4న ముస్త్యాలలో తాళం వేసి ఉన్న తరిగొప్పుల నర్సింహులు ఇంట్లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. చోరీ చేసిన రెండున్నర తులాల బంగారు నెక్లెస్, 25 తులాల వెండి పట్టీలతో పాటు బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

సనాతన ధర్మమే లక్ష్యం



మాట్లాడుతున్న బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతులు

కొమురవెల్లి(సిద్దిపేట): సనాతన ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా ఆలయాల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామని సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామణి, మహామండలేశ్వర్, సిద్ధేశ్వరనందగిరి మహరాజు అన్నారు. శనివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పురాతన ఆలయాల పరిరక్షణ కోసం పని చేయాలని సూచించారు. గ్రామాల్లో ఏమైనా పురాతన ఆలయాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, మల్లయ్య, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతు

జిన్నారం (పటాన్‌చెరు): చెరువులో ఈతకు వెళ్లిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై హనుమంత్ వివరాల ప్రకారం... గడ్డపోతారం పట్టణ పరిధిలోని చొదరిగూడెం గ్రామానికి చెందిన గురుగోజు పాండురంగ చారి (45)కి ప్రతిరోజు లింగం చెరువులో ఈతకు వెళ్లే అలవాటు ఉంది. రోజు లాగే శనివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఈతకు వెళ్లాడు. చెరువులో ఈత కొడుతుండగా నీటిలో మునిగాడు. కనిపించకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు గాలించిన ఆచూకీ లభించలేదు.

చెరువులో మృతదేహం లభ్యం

సంగారెడ్డి టౌన్: అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు. ఈ ఘటన సంగారెడ్డి మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి వివరాల ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన శివసాకేత్ (19) ఈనెల 13న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అయితే అతడు డ్రైవర్‌గా ఊబర్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో దర్యాప్తులో భాగంగా ఫసల్వాది శివారులోని మంజీరా వద్ద కారు పార్కు చేసి ఉండటంతో పోలీసులు పరిశీలించారు. చెరువులో మృతదేహాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు.


చేపల వేటకు వెళ్లి వ్యక్తి..



మల్లేశ్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన చేగుంటలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నార్సింగి గ్రామానికి చెందిన మల్లేశ్(45) చేగుంటలోని గీతా పాఠశాల సమీపంలోని కల్వర్టు వద్ద చేపలు పడుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటకు తీశారు.

ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్య



ప్రవీణ్ కుమార్

దుబ్బాకటౌన్: ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై కీర్తి రాజు వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన జమునగారి ప్రవీణ్ కుమార్ (33) వ్యవసాయంతో పాటు వరి కోత యంత్రం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు, ముగ్గురు సోదరులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలం క్రితం వ్యవసాయ నిర్వహణతో పాటు ఇతర అవసరాల కోసం 8 లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ప్రవీణ్ శుక్రవారం రాత్రి పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

మనస్తాపంతో వ్యక్తి..



మష్కురి లక్ష్మయ్య

పాపన్నపేట(మెదక్): మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆరెపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మష్కురి లక్ష్మయ్య(57)వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. కొంత కాలంగా అతను మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ నెల 16న అతిగా మద్యం తాగి వచ్చిన అతన్ని భార్యలు నిలదీశారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మయ్య బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. నోట్లో నుంచి నురగలు వస్తుండటంతో గమనించిన కుటుంబీకులు మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.

కుటుంబ సమస్యలతో మేస్త్రీ..



మల్లేశం

రామాయంపేట(మెదక్): కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... రామాయంపేట పట్టణానికి చెందిన పెంటమీది మల్లేశం (38) మేస్త్రీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో తన భార్యతో గొడవపడిన మల్లేశం ఆమెతో పాటు ముగ్గురు పిల్లలను ఇంటి నుంచి పంపించి రాత్రి ఉరి వేసుకున్నాడు. పక్క ఇంట్లో ఉంటున్న వారు చూసి మృతుడి భార్య అనితకు సమాచారం అందజేశారు.

ఫైనాన్స్ వేధింపులకు యువకుడు బలి



ఐరేని మల్లేశం

సిద్దిపేటఅర్బన్: ఫైనాన్స్ వేధింపులకు యువకుడి బలయ్యాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు, త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం... ఎల్లుపల్లి గ్రామానికి చెందిన ఐరేని మల్లేశం (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 2023లో నూతనంగా నిర్మించుకున్న ఇంటి కోసం ఓ ప్రైవేట్ కంపెనీ ఫైనాన్స్‌లో రూ. 7 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనికి తోడు టీ షాపు నిర్వహించడానికి కొంత అప్పు చేశాడు. ఈ క్రమంలో టీ షాపు సరిగా నడవకపోవడంతో ఆర్థికంగా భారం ఎక్కువైంది. దీంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోవడంతో ఫైనాన్స్ వారు ఫోన్ చేసి ఒత్తిడి చేస్తున్నారు. ఫోన్ చేయడమే కాకుండా ఇంటికి రావడం, పనికి వెళ్లిన చోటుకి వెళ్లి వేధిస్తున్నారు. కొన్ని రోజులు సమయం ఇస్తే డబ్బులు చెల్లిస్తామని చెప్పినప్పటికీ వినకుండా ఈ నెల 16న సాయంత్రం ఫైనాన్స్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇంటికి వచ్చి డబ్బులు ఇస్తేనే వెళ్తామని చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన అతడు వ్యవసాయ బావి వద్ద ఉరివేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన రాంచంద్రారెడ్డి అంత్యక్రియలు



అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

కోహెడరూరల్(హుస్నాబాద్): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కట్టా రాంచంద్రారెడ్డి అలియాస్ కోసా అలియాస్ రాజు దాదా అంత్యక్రియలు కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలో శనివారం ముగిశాయి. ఛత్తీస్‌గఢ్‌లో గత నెల 22న పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. కాగా ఆయన మృతదేహాన్ని ఛత్తీస్‌గఢ్ నుంచి కుమారుడు రాజాచంద్ర స్వగ్రామానికి ఉదయం తీసుకొచ్చారు. గ్రామంలో ఆయన ఇంటి వద్ద మృతదేహన్ని చూసి భార్య శాంతితో పాటు కూతురు కన్నీరు మున్నీరుగా విలపించారు. కడసారి చూసేందుకు పలు విప్లవ, ప్రజా పౌరహక్కుల సంఘాల, రాజకీయ పార్టీల నేతలతో పాటు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. కాగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మవోయిస్టులను హతమారుస్తున్నారని పలువురు మండిపడ్డారు.

17 రోజుల తర్వాత మృతదేహం లభ్యం

జోగిపేట(అందోల్): జోగిపేటకు చెందిన లోకచంద్ర (37) మృతదేహం చౌటకూరు మండలం వెండికోలు శివారులోని మంజీరా నది ఒడ్డున 17 రోజుల తర్వాత లభ్యమైంది. గత నెల 30న శివ్వంపేట బ్రిడ్జిపై నుంచి మంజీరా నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలిసిందే. అప్పట్లో గాలింపు చర్యలు చేపట్టినా సింగూరు ప్రాజెక్టు గేట్లు తెరవడంతో వరద ప్రవాహం తీవ్రంగా ఉండటం వల్ల మృతదేహం దొరకలేదు. మూడు రోజుల క్రితం నీటి ప్రవాహం తగ్గడం వల్ల మృతదేహం బయటపడింది. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో తహసీల్దారు కార్యాలయం ఎదుట మృతుడి కుటుంబీకులు, బంధువులు నిరసన తెలిపారు. మృతుడి తల్లి ప్రమీల తన కొడుకు చావుకు రాజకీయ నాయకులు కారణమని ఆరోపించింది. పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో నిరసన విరమించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



రెడ్డిపల్లి జింకలత

నర్సాపూర్ రూరల్: వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలోని నాగులపల్లిలో శనివారం జరిగింది. ఎస్సై రంజిత్ రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రెడ్డిపల్లి ప్రశాంత్, భార్య జింకలత(23)ల మధ్య గొడవ జరిగింది. దీంతో శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం చుట్టుపక్కలతో పాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇంట్లో గొడవపడి వెళ్లి..



అల్లు రామలింగయ్య

సంగారెడ్డి క్రైమ్: బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తపేట్ల అల్లు రామలింగయ్య (38), సంగారెడ్డి పట్టణానికి వచ్చి గణేశ్‌నగర్ కాలనీలో స్థిరపడ్డాడు. వృత్తిరీత్యా పట్టణంలో పద్మశాలి పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి భార్య రాజేశ్వరి, ముగ్గురు పిల్లలున్నారు. కొన్ని నెలలుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత నెల 22న ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో భార్యతో గొడవపడి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చేగుంటలో మహిళ



కళ్యాణి

చేగుంట(తూప్రాన్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... మండల కేంద్రమైన చేగుంటకు చెందిన దుద్యాల కళ్యాణి శుక్రవారం బంధువుల ఇంటికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. శుక్రవారం రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో ఫోన్ చేస్తే స్పందన లేకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అదృశ్యమై.. హత్యకు గురై..

కుళ్లిన స్థితిలో చెరువులో మృతదేహం లభ్యం



బాలమణి

వర్గల్/ములుగు(గజ్వేల్): అదృశ్యమైన మహిళ హత్యకు గురైంది. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం... వర్గల్ మండలం మీనాజీపేటకు చెందిన మంకని బాలమణి(55) ఈ నెల 10న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కూతురు నవనీత ఫిర్యాదు మేరకు 12న గౌరారం పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తు ఓ వైపు, కుటుంబీకులు, బంధుగణం ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతుకుతున్నారు. ఈ తరుణంలో శుక్రవారం రాత్రి ములుగు మండలం తున్కిబొల్లారం అయ్యప్ప చెరువులో నల్లటి ప్లాస్టిక్ కవర్ చుట్టేసి, కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహం వెలికి తీయించి మీనాజీపేటకు చెందిన బాలమణిగా గుర్తించారు. ఆమె హత్యకు గురైనట్లు నిర్ధారించి, పలు ఆధారాలు సేకరించారు. శనివారం మృతదేహానికి గజ్వేల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపించి కుటుంబీకులకు అప్పగించారు.

మెట్ల పైనుంచి జారి పడి కూలి మృతి

సంగారెడ్డి క్రైమ్: ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారి పడి కూలి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన శేఖర్(43) వృత్తిరీత్యా కూలీ పనులు చేస్తున్నాడు. ఈ నెల 17న ఉదయం 10గంటల సమయంలో అద్దెకు ఉంటున్న ఇంట్లోని మెట్లపై నుంచి కాలు జారి పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..



కిషన్

గజ్వేల్‌రూరల్: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పిడిచెడ్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సూరారం కిషన్(28)కు భార్యతో పాటు ఓ కూతురు ఉన్నారు. రెండేళ్ల క్రితం కిషన్ అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తున్నప్పటికీ తగ్గకపోవడంతో కూతురితో కలిసి భార్య అతడిని వదిలి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన అతడు ఈనెల 12న పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.